# అన్వేషణ

రచన: శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

ఇది తలుచుకున్నప్పుడు తనేమిటో అగ్నిగుండంలో కూచున్నట్లు అనిపిస్తుంది—ఏం? తనుకూడ అలాటి దాంపత్యముతో సుఖాన్ని అనుభవించకూడదు?—ఇన్నాళ్ళనుంచీ వరలక్ష్మితో తను అలాగే వున్నాడుగా?...ఇప్పుడు పరోక్షంలో అలా అనుమానపడటం ఎందుకు?...ఇది తన భార్యకు మనసార చేసిన అపరాధమౌతుందేమో...ద్రోహమౌతుందేమో...

ఎంతసేపు చూసినా, అతని మనసులో వుంటే కలవరం మరీ ఎక్కువైంది. కాని ఇంతకు పూర్వం తనే వ్యాకులతతో ఇక్కడికి వొచ్చాడో అది సమసిపోలేదు...దీపాలు వెలిగినై...చిరాగ్గా అక్కడినుంచి బయటకు వొచ్చేశాడు.

"ఏరా బ్రదర్" అంటూ ప్రక్కనున్న చైర్లో అతను పిలిచిన మాటలు అతనికి వినపడనేలేదు...ఎక్కడికో నడిచిపోతున్నాడు రోడ్డువెంట...

అరగంట అయిన తరువాత తను మరోపేటలో నడుస్తున్నాననీ ఇంటికి వెళ్ళటంలేదని తెలిసిందతనికి...ఇంటికి తిరిగివస్తూంటే...అబ్బ...అక్కడికి వెళ్ళాలి కావున్ను...అనుకుంటాడు ఎంతో బాధగా...వరలక్ష్మి తనకోసరం ఎదురుచూస్తూంటుంది కావున్ను. వెళ్ళటంతోటే తనతో మాట్లాడుతుంది...అబ్బ...దానితో మాట్లాడాలి కావున్ను. అనుకుంటాడు విసుగ్గా—మొహం చిట్లించుకుని—ఐతే ఏం. సరదాగా మాట్లాడరాదూ. ఏమో...ఎందుకనో...ఆ విషయం తలుచుకుంటే తనకు కంటకంగా తోస్తున్నది. వొళ్ళంతా ఏమిటో పాకుతున్నట్లున్నది. ప్రతి రోమకూపంలోను సూదులు పెట్టి పొడిచినట్లు చురుకు చురుకుమని బాధిస్తున్నది—వాళ్ళిద్దరినీ గురించి లోకం అనేకవిధాలుగా వూహాగానం చెయ్యొచ్చు. కాని వాళ్ళకు బుద్ధివొచ్చేలా తమ అన్యోన్యతను నిరూపించుకోవచ్చునుగా?...అంతమాత్రం స్థాయి మనకు లేదెప్పుడు. లోకం అన్నమాటలవల్లనే తనకెంత వ్యాకులత కలిగింది. ఇంకెన్నివిధాల కప్పిపుచ్చుకోవాలని చూసినా, తనని లోకులంతా అలా అంటూనే వుంటారు...

వరలక్ష్మికీ తనకీ ఏలాటి అన్యోన్యత వున్నా దానివెనుక తన అసమర్థతకూడ దాగివున్నదని లోకం భావిస్తున్నది. తనకు తెలియకుండా ఇలా ఎంతమందిలో వ్యాపించిందో...ఇందాక పార్కులో అడిగిన పొడుపుకథ తన నిజాయితీని తెలుసుకోవటానికి అడిగినదేమో...లేకుంటే తననే అడగవలసిన అవసరంఏముంటుంది? వాళ్ళేసమాధానంకూడా చెప్పారు. అది తనకూడా దారి చూపించటమేమో...

ఇల్లు దగ్గరకొస్తున్న కొద్దీ గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయ్ వాయువేగంతో...ఏదో తప్పు చేసినపిల్లడు చెప్పకుండా పారిపోయి ఇంటికి తిరిగి వస్తున్నట్లు గజగజా వణుకు ప్రారంభమైంది—ఎందుకు?...సరిగా మనస్సువిప్పి మాట్లాడుకోలేక ఏమీ ఎరుగని భార్యమీద ఏనిందమోపి ఇంట్లోనుంచి లేచిపోతాడు?...

గుట్టు చప్పుడు కాకుండా అరుగుమీదకువచ్చి కూచున్నాడు—అసలు తన భార్యమీద నిందమోపటం ఎందుకు? అని ఇంట్లో వుండగలడా?...లేదు. తనకుతానే వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాడు-వరలక్ష్మి తన కారాధ్యదేవత. ఆమెలో ఏమీ తప్పులేదు. అని మనస్సులో ఒక్కసారి వరలక్ష్మి సద్భావాన్ని తలుచుకున్నాడు—

గది తలుపు వోరవాకిలిగా వేసి పడుకున్నది వరలక్ష్మి... మెల్లిగా తలుపుతోసుకుని భయభయంగా అడుగులో అడుగువేసుకుంటూ దొంగలా లోపల ప్రవేశించాడు. కాదు మరి?...ఇపుడు తన బలహీనతవలన వరలక్ష్మి సద్భావాన్నే హరించాడు—మంచం దగ్గర నుంచున్నాడు. చేతిమీదకొట్టి లేపుదామ అనుకున్నాడు. తనచేయి వెనక్కితీసుకుంటాడు—ఇప్పుడు వరలక్ష్మిని నిద్రలేపాలంటే...ఎందుకనో తను పెద్ద అపరాధం చేస్తున్నట్లు అనుపిస్తుంది. తనకంతమాత్రం స్వతంత్రంలేదు? ఎందుకో తనకీ భయం?...మంచపుపట్టె నానుకుని వెనక్కుతిరిగి కొంతసేపు అలాగే నుంచున్నాడు. ఏమిటో విచారించుతూ మునిపళ్ళతో గోళ్ళు కొరుకుతూ వరలక్ష్మి సగం చదివి తలాపిదిక్కున పెట్టిన షేక్స్పియర్ నాటకం కనుపించింది. పేరు మాత్రం చదవకలిగాడు...ఒథెలో...అని...వరలక్ష్మి తనకంటె బాగుగా చదువుకున్నదని తనకు తెలుసుగా...అందుకనే షేక్స్పియర్ నాటకం చదువుతున్నది...అంతమాత్రానికి తనకు అభిమానమెందుకు? చిన్నతనమెందుకు?—కాని, రోజూలా ఇప్పుడు సంతోషించలేకపోతున్నాడు. ఇది వరలక్ష్మి సొత్తు నీవు చూడటానికైనా అర్హుడవుకావు. నీకు విజ్ఞానంలేదు అన్నట్లుగా ఆ పుస్తకం చేతులోనుంచి జారి కిందపడింది. కొద్దిగా చప్పుడైంది. వరలక్ష్మి ఇటు వొత్తిగిలిపడుకున్నది కుడిచేయి తలక్రిందపెట్టుకుని—మంచం దగ్గరనుంచి ఇవతలకువొచ్చి కుర్చీలో కూలబడ్డాడు. సీతారాముడు ఒక చిన్నపళ్ళెంలో సగం గుచ్చిన మల్లెపూల చెండువున్నది. వరలక్ష్మి తల్లో ఎందుకు పెట్టుకోలేదు. తనుకూడ వొస్తాడని కావున్ను...

ఎదురుగుండా వున్న అద్దం నవ్వింది తన్నిచూసి, నీ బ్రతుకంతా నవ్వులపాలే. అన్నట్లు వరలక్ష్మి కూడ నవ్వుతున్నట్లు అద్దంలో కనుపించింది. దొంగనిద్ర పోతున్నదేమో...అని అనుమానపడ్డాడు తన చెడుమనస్సులో...దగ్గరగా వెళ్ళి మొహం దగ్గర తలపెట్టి చూశాడు. ఒళ్ళో తెలియకుండా నిద్రపోతున్నది—ఇక తను వరలక్ష్మిని నిద్రలేప తలుచుకోలేదు. అక్కడినుంచి వెళ్లిపోవటానికే నిశ్చయించుకున్నాడు...వరలక్ష్మి వంక చూస్తే జాలి కలిగింది. పాపం, తను ఇంటికివొస్తాడని గుడ్లు కూరుకొచ్చేలా చూసి చూసి పడుకున్నది కావున్ను... తరువాత ఎంత ఇదౌతుందో ఆమె కోమలహృదయంలో ఎంతటి వజ్రాఘాతం తగులుతుంది.

* * *

డ్రాయరుమీద పెన్సు కాగితాలు పడున్నాయ్. ఇక లేఖ వ్రాసి వరలక్ష్మి తలాపి దిక్కున పెట్టాడు. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. వరలక్ష్మి ముఖంవంక ఒక్కసారి పరీక్షగా చూశాడు. చిరునవ్వు నవ్వుతున్నట్లు కనపడుతూంది. ఏకోశానా కోపం అన్నమాట కాని మరోభావం కాని, ఆమె ముఖంలో కనపడటం లేదు. ఎంతచూసినా ఇంకా చూడాలి అనిపించుతున్నది? ఇంత కఠిన హృదయంతో వరలక్ష్మిలాంటి భార్యను వొదిలిపెడుతున్నాడు. ఎక్కడికి వెడతాడు? తనకు జీవితంలో వెలుగురేఖ ఎక్కడ కనుపించుతుందో...

తనుచేస్తున్నది మోసం అని తనకు తెలుసు. వరలక్ష్మి ఏం తెలుసుకుంటుంది? ఈ వృత్తాంతమంతా ఈలేఖ పూర్తిగా వరలక్ష్మికి తెలియజేస్తుంది. అనుకున్నాడు—ఎదురుగుండా డ్రాయరులో వున్నడబ్బు దొంగలా జేబులో వేసుకున్నాడు...మరొక్కసారి మంచం దగ్గరకొచ్చి వరలక్ష్మి ముఖంలోకి పరీక్షగా చూశాడు. "నే వెడుతున్నాను" అని చెబుతున్నట్లుగా. ఎంతచూసినా వరలక్ష్మి ముఖం అలా చిరునవ్వుతోనే కనపడుతుంది. పాపం తెలిస్తే తనభర్తనలా వెళ్ళనిచ్చేది కాదేమో...వొదిలిపెట్టిరాలేక వెనక్కు తిరిగి గుమ్మందాక వొచ్చాడు. అంతా నిశ్శబ్దం...వెనుకనించి ఎవరో పగలపడి నవ్వుతున్నట్లే వినపడుతుంది. తను వరలక్ష్మితో ఏకాంతంగా వుంటే అంచేతనాలైన దూలాలు వాసాలుకూడ వికృతాట్టహాసం చేస్తున్నట్లు కనపడుతున్నది భయంకరంగా, వెనక్కు తిరిగి చూశాడు. ఏమిటో అతనిక్కి

భయంవేసింది. చేత్తో వెన్ను చరుచుకున్నాడు. వరలక్ష్మిని నిద్రలేపితే...ఛీ...తనెందుకు లేపుతాడు? ఏదో వొకశక్తి వొద్దు అని తన్ని గట్టిగా హెచ్చరించింది. వరలక్ష్మి! నన్ను మన్నించవు? అనుకున్నాడు మనసులో కాళ్లు గజగజా వొణుకుతుండగానే విరిగి గుమ్మందాక వొచ్చాడు. గడపలు తెగి వాకిట్లోకివస్తుంటే తననెవరో ముందుకు పడత్రోసినట్టు తన ఎదురుగుండా ఎవరో వొక స్త్రీమూర్తి నుంచుని జాలిగా చూస్తున్నట్లు కనిపించింది. ఏమిటో అలాగే గుడ్లుపెట్టుకు చూస్తాడు. కాళ్లు చేతులూ ఆడవు. వరలక్ష్మి అని అందామని నోటిదాక వచ్చింది. లోపలినుంచి మాటపెగిలిరాదు. ఒళ్లు ముచ్చెమటలు పోసినాయ్—ఇంకా వరలక్ష్మి దొంగనిద్ర పోతున్నది. తనని మాసి లేచివచ్చిందనే అతని అభిప్రాయం. గుమ్మంలోనుంచుని లోపలకు తొంగిచూశాడు. ఆ దీపపువెలుగులో నిద్రలోవున్న వరలక్ష్మి ముఖం అలా అమాయికంగా కనపడుతున్నది,—తనిలా వరలక్ష్మిని వొదిలివెడుతున్నాడు. ఇది మోసంచేయడమేనేమో, కాని, ఏదో శక్తి తన్నావరించి ఇలా చేయిస్తున్నది. ఈ పాడులోకం వరలక్ష్మిని ఎన్నివిధాల అంటుందో...అయినా వరలక్ష్మి తన్ను మన్నించుతుందనే అతని ఆశయం...ఇలా అనుకుంటూ లోపలకు చూస్తూనే తలుపులు దగ్గరగా వేసి గడపను దిగాడు. ఆ అర్ధరాత్రే రోడ్డువెంట పడి ఎక్కడికో నడిచిపోయినాడు సీతారాముడు...ఏం జరిగిందో...పాపం...నిద్రపోతున్న వరలక్ష్మికేమీ తెలియదు—

## 5

తెల్లవారి నిద్రలేచేసరికి తనొక్కతే వుండటం చూసి గాభరాపడింది వరలక్ష్మి. సీతారాముడు ఎన్నడూ తనకంటె ముందులేచి వెడుతూంటేవాడు కాదు. ఇంకా మంచం మీది కాలు క్రిందపెట్టనేలేదు...ఇటుచూసేసరికి...తలాపి దిక్కున...పెద్ద పెద్ద అక్షరాలతో...ఒక కాగితం మాత్రం కనపడుతూన్నది. "ఇదెవరు పెట్టారు?...అనుకుని తీసి చూసింది ఆశ్చర్యంగా...




# టెంపరేచరు

మీ టెంపరేచరు 102కు ఎక్కువయిన ముందు బాధపడునది మీ కేశములు. మీకు చిన్నమ్మ వారయినను యిన్‌ఫ్లూయంజా, టైఫాయిడ్ అయినను లేక న్యూమోనియా జాడ్యమయినను మరే జాడ్యమయినను, పెద్దజ్వరమునకు తదుపరి శిరోజములు అమితముగా ఊడిపోవును. జ్వరమెంత కొద్దిదైనను జుట్టు రాలుట సత్యము. దానిని నివారించు ప్రయత్నము చేయకపోయినచో అటులనే రాలుచుండును.

అట్టి ఆపదల నాహ్వానింపకుడు. ఇప్పుడే కేశవర్ధినితో మీ తలవెండ్రుకలను రక్షించుకొనుడు. జాడ్యము మీ కురులను ఎంత చిన్నవిగా చేసినను కేశవర్ధిని మీ కేశములను సమముగాను సమృద్ధిగాను చేయును.

# కేశవర్ధిని

యిప్పుడెందు కుపయోగించకూడదు?

కేశవర్ధిని అ. 12. కేశవర్ధిని పాంపు అ. 12.

ప్యాకింగు పోస్టేజి అధికము.

వర్తకు లందరివద్దను దొరకును లేక

## సౌత్ ఇండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.

"వరలక్ష్మీ! నువ్వేమీ అనుకోకు. ఇదంతా నా బలహీనతకు నిదర్శనం...నీలాంటి భార్యను వొదిలిపెట్టి గుండెరాయిచేసుకుని ఎక్కడికో వెళ్ళిపోతున్నాను. నిన్ను ప్రతి నిమిషమూ తలుచుకుంటూనే వుంటాను. నిన్నే ఆదర్శంగా పెట్టుకుంటాను. నీలా విజ్ఞానం సంపాదించటానికి ప్రయత్నిస్తాను. నే నే లక్ష్యాన్ని అన్వేషిస్తూ వెడుతున్నానో అది సిద్ధించిననాడు తిరిగి నిన్ను కలుసుకుంటా...వరలక్ష్మీ... నిన్ను మనసార దీవిస్తూంటాను. నన్ను మన్నించుతావనే తలుస్తాను...తప్పకుండా..."

చదువుతూండగానే గజగజ వణికే చేతుల్లోనుంచి ఆ కాగితం జారి, పక్కమీదపడింది. కన్నీటి బొట్లు బొట బొటా దానిమీదపడినాయ్. అయోమయమైన ఈ పరిస్థితిలో తన కాధారమెవరా? అని భయభయంగా గది నలువైపులా చూసింది వరలక్ష్మి...కడుపులో గుబులు గుబులుగా బయలుదేరింది...

కొంటెతనంగా వ్రాసిపెట్టాడేమో అనుకున్నది. కొంతసేపు తనతో పరాచకమెందుకు?...అయినా ఇలా ఎందుకు వ్రాస్తారు?...అనుకున్నది. ఏమీ సమాధానం చెప్పుకోలేక మాటిమాటికీ ఆ కాగితమే చూస్తూ అక్కడే కూచున్నది దిగులుగా...

బాగా తెల్లారింది, కిటికీలోనుంచి అరుణ కిరణాలు చెంపలమీద పడుతున్నాయ్ తన్ను ఓదారుస్తున్నట్లుగా?...ఆ కాగితం మడిచి పుస్తకంలో పెట్టి వాకిట్లోకి వచ్చింది వరలక్ష్మి. అత్తయ్యతో ఏమీ మాట్లాడలేదు అలాగే మొహం కడుక్కుని వచ్చి మళ్ళీ ఆ కాగితమే చదువుకుంటూ కూచున్నది గదిలో...

ఇంతకు పూర్వం సంగతి తనకేమీ తెలియదు. చూస్తూండగానే రాత్రి తనతో సరి మాట్లాడకుండా అరుగుమీద కూచున్న దృశ్యం కళ్ళకు కట్టినట్లైంది. ఎందుకనో అప్పుడలా కూచున్నారు? అనుకున్నది. దీనికంతకూ అదే నాందీయేమో...ఇంతకుముందు తనేమన్నది?...ఎంత ఆలోచించినా తను పల్లెత్తుమాట సీతారాముణ్ణి అనలేదు అని తన బుద్ధే తనకు సాక్ష్యమిస్తున్నది. సీతారాముడి విషయంలో మరోలా కష్టంగా ఏం ప్రవర్తించింది?... అతనే చెబుతున్నాడుగా..."ఇదంతా నా బలహీనత" అని ఇంకా తన అపరాధమేముంటుంది?...

ఇదంతా చదివినకొలదీ ఒక్కటి మాత్రం వరలక్ష్మి మనస్సుకు తోచింది. తను చదువుకోవటమే అతనికి భార్యకావటమే అపరాధమేమో... ఈనాడు సీతారాముడికి చదువుకోనాలి అని బుద్ధిపుట్టటం, గుండెరాయి చేసుకుని తన్నువిడిచి వెళ్ళిపోవటం, ఇదంతా ఎందుకు జరిగింది? దీనికంతకూ పరోక్షంగా, తనే కారణమైతే తనెన్నడూ ఇలాంటి నిందను భరించదు. సీతారాముడు వ్రాసినలేఖలో అంత మాత్రం గూఢార్థం వున్నదని గ్రహించింది వరలక్ష్మి...ఇతనికి ఎన్నడూలేని ఈ కోరిక ఎందైనా అనుమానాన్ని రేకెత్తించింది. ఇక నీ విషయంలో ఎంత తప్పుకుందామని ప్రయత్నించినా, రాగల అపవాదు తనమీదే పడుతుంది అనుకున్నది...లోకులంతా ఏమనుకుంటారు?..."చదువుకున్న భార్య నిజంగా వాడినెంత ఇదిగాచూసింది. ఎంత హింస పెట్టిందో వాడికి ఇష్టంలేనిపనులు ఎన్ని చేసిందో అంటారు... కాని, ఇంతవరకు తమ ఇద్దరిమధ్యా కల అన్యోన్యతను ఎవరు గ్రహించుతారు? తనమీదనే ఈ నిందారమంతా మోపటానికి ప్రయత్నిస్తారు. ఇప్పుడు తను చెయ్యతగినది ఏముంది? అని విచారించసాగింది. ఇదంతా తనుచేసినను తప్పేఅయితే, ఇతన్ని పెళ్ళాడి చదువుకొనటమే మహా అపరాధమైతే ఎన్నటికీ ఈ అపవాదు సహించదు. ఏనాటికైనా అతనిజాడవెలికి నిజమేమిటో లోకానికి నిరూపించాలి అనుకున్నది. ఇదంతా చివరికి అంత అగాధంగా పరిణమించుతుందో...అని మనసులో భయపడింది.

(సశేషం)

గతసంచిక తరువాయి

# అన్వేషణ



శ్రీ. ఘట్టి కృష్ణమూర్తి

ఇలా ఆలోచిస్తూ కొంతసేపు అక్కడే కూచున్నది వరలక్ష్మి. సీతారాముడు వ్రాసిపెట్టిన లేఖను ముక్కలుముక్కలుగా చింపి అవతల పారవేసింది. మనస్సులేమీ పాలుపోకపిచ్చిదానిలా గదిలోనే అటూఇటూ తిరుగుతుంది.

బాగా పొద్దు ఎక్కింది. ఎంతసేపటికీ వరలక్ష్మి బయటకురాదు. ఏపనీముట్టుకోదు. ఎందుకనో అనుకుని పావిట్లోనుంచుని అత్తయ్య పిలిచింది. వరలక్ష్మి తొందర తొందరగా మొహాన బొట్టుపెట్టుకుని బయటకు వొచ్చింది. ఎంత ప్రయత్నించినా ఏదో వొక విచారరేఖ తన ముఖంలో కనపడుతున్నది...తనకి తాను ఎంత ఇదిగా సమాధానం చెప్పుకున్నా ఏపని చెయ్యలేక పోతున్నది, ఉన్నకొద్దీ ఏమిటో ఏమిటో ఆలోచనలు మనసులో గిరగిరా తిరగటం మొదలుపెట్టినాయ్. ఎంత తెలివితేటలు ఉపయోగించి కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించినా మనసులో వుండే వ్యాకులభావం ఏదోవొక విధంగా ముఖంలో వ్యక్తమవుతూనే వుంటుంది. చివరికి అత్తయ్య అడగనే అడిగింది...ఏమే ఇవ్వాళ అలా వున్నావేమిటి. అని ఏమీలేదు అత్తయ్యా నేనెట్టావున్నాను..అని ఏదో సమాధానం చెప్పింది. వెంటనే గదిలోకివచ్చి అద్దంలో మొహంచూసుకున్నది. ఏమిటో ముడుచుకుపోయినట్లున్నది మొహం. తనకు తానే ఆశ్చర్యపోయింది...

కొంతసేపటివరకూ సీతారాముడి అజ ఇంట్లో ఎవరికీలేకపోయింది. నిద్రలేచి ఎక్కడికివెళ్లాడో... ఎవరితో కబుర్లాడుతూకూచున్నాడో అనుకున్నారు. ఎనిమిది గంటలకు ఎవరోవొచ్చారు అతనికోసరం... "లేరు" అని సమాధానం చెప్పింది వరలక్ష్మి... కొంతసేపటికి అత్తగారే అడిగింది. "మావాడుఏమైనాడే వరలక్ష్మి"అని.

ఏమో అత్తయ్యా ఎటు వెళ్లారును...అన్నది మాటతడబడుచూ...నీతో చెప్పలా? ఎక్కడికి వెళ్లాడో...ఏమో నాకసలు చెప్పనే లేదు...ప్రొద్దున్నే స్నానమన్నా చెయ్యకుండా ఎక్కడికి వెళ్లాడో... అనుకున్నారు వాళ్ళంతా.

వరలక్ష్మి గదిలోకివచ్చి కూచున్నదిదిగులుగా. వీరందరికి ఇప్పుడు తను సమాధానం చెప్పాలి కావున్నా. ఎంత తెలియనట్లుగా నటించినా చివరికి అంతా తనమీదనే నిందమోపుతారేమో...కాగితం కూడా చింపివేశాను అనుకున్నది. కాని అదికూడ ఒకందుకు మంచిదే. నిజంగా చదివితే అందరూ తన మీదనే నింద మోపటానికి వీలుంటుంది. చివరికి ఏం కానున్నదో అంతా భవిష్యత్తుమీద ఆధారపడి వూరుకున్నది వరలక్ష్మి.

మరొకసారి సీతారాముడు ఏమయ్యాడు? అనే ప్రస్తావన వొచ్చింది. ఏ విషయమూ తెలియక పోయేసరికి అప్పుడే ఇరుగుపొరుగు వారంతా పోగైనారు. వరలక్ష్మిని అడిగారు...ఎక్కడికన్నా వెడితే... పెళ్లాంతోనైనా చెప్పడు? ఏమిటిదంతా చోద్యం కాకపోతేను అన్నారు నలుగురూను. పోనీ. ఎక్కడికన్నాపంపితే నేనే పంపానని చెప్పు నిన్నేమీ అనం

గా అన్నారు మరి కొంతమంది. ‘‘ఇదేమో కుంభకోణం చేసిందిరా, ఏమీ తెలియక పోవటానికి అంత నంగనాచా ఏమిటి? చదువులు చదివిందిగా చదువులు. మొగుడు ఎక్కడికివెళ్ళింది చెప్పకల్గిన తెలివి తేటలులేవు? అబ్బాయ్ వెయ్యిచెప్పండి లక్షచెప్పండి...ఎక్కడికి వెళ్ళాడో దానికి రూఢిగా తెలిసేవుంటుంది—రాత్రి ఇంట్లో పడుకున్నవాడు ఎక్కడికో వెళ్ళితే తెలియదుట. ఎవరు చెప్పారుమీకు..పదిమంది పోగైనారు. తలొకమాటా అనటంమొదలుపెట్టారు. ఏమో అత్తయ్యా నిజంగా నాకుతెలియదు ఎక్కడికి వెళ్ళాడూను’’ అన్నది వరలక్ష్మి హృదయభారంతో క్రుంగిపోతూ...తనమాటఎవరు వినిపించుకుంటారు? ఎవర్కి ఏంచెప్పి నమ్మించాలో తనకేమీ అర్థం కాలేదు—

ఇప్పుడు తనమీదపడిన బాధ్యత చాలా భారమైంది. ఎన్నివిధాల తన నిష్కళంకత్వాన్ని నిరూపించుకోచూచినా ఈపాడు లోకం తనమీదనే నిందలువేస్తుంది. ఇది తన జీవితానికే తీరని కళంకం. తనింతవరకూ సంపాదించుకున్న విజ్ఞానానికి గొడ్డలిపెట్టు. తనవ్యక్తిత్వానికేభంగకరం. ఏమైనా రాబోయే అపవాదునుండి తను బయటపడాలి. తనసర్వశక్తిని ఒడ్డయినా తననిర్దోషిత్వాన్నినిరూపించుకోవాలి. తనిన్నాళ్ళనుంచి ఏమనస్తత్వంతో కాపురం చేసింది? తనెందుకు చదివే చదువునంతా మధ్యలోఆపి, పొంగులుపారివస్తున్న ఉత్కంఠతను చంపుకొని ఇన్నాళ్ళనుంచి ఒకసామాన్య సంసార స్త్రీలాగవుంటున్నది? ఇలాంటి అపవాదులు విషసర్పాల్లా తన్ను వెంటాడుతాయనే, ఇలాంటి అపవాదును లోకం ఆపాదించుతుందనే దైవికమైన భయంతో నాటినుంచి నేటివరకూ వర్తించుతూ వస్తుంది. అదంతా ఒక్కక్షణంలో మంటకలిసిపోయింది. తన నిర్దోషిత్వం తనవిశాలభావం అతనిద్వారా లోకానికి తెలియజెప్పించిననాడే తనకీ పాడులోకంలో ఒక గౌరవప్రదమైన స్థానం లభించుతుంది...వరలక్ష్మి మనసులో ఏదో ఇంకాఇంకా మథనపడుతూనే వున్నది. ఆగదిలోనే అటూయిటూ పచారుచేస్తుంది. మంచంమీద కూచుని కిటికీలోనుంచి బయటికి చూస్తూ ఏమిటో దీర్ఘంగా విచారించుకుంది.

* * *

ఇట్టే చూస్తునుండగానే పదకొండు గంటలైంది. పెద్దకొడుకు లక్ష్మీనారాయణ అప్పుడే అత్తవారి వూరునుంచి వొచ్చాడు రైలుదిగి. వచ్చీరావటంతోనే...గడపలో అడుగు పెట్టకమునుపే...సీతారాముడు వున్నాడా?...అని అడిగాడు ఆదుర్దాగా... అమ్మా నాన్నా ఎంతో గాభరాగా తిరిగి అడిగారు... ‘‘దేనికి’’ అని...వరలక్ష్మి గది గుమ్మంలోనుంచుని చూస్తూంది. మనస్సు ఉండబట్టలేక ‘దేనికి బావా’’ అన్నది అక్కడనుంచే. అందరూ వరలక్ష్మివంకకు తిరిగిచూశారు. ‘‘ఇంట్లో లేడా?’’ మళ్ళీఅడిగాడు లక్ష్మీనారాయణ. ‘‘లేడు’’ అన్నది తల్లి... ఇంకేమిటో చెప్పాలి అనుకుంటున్నది. అతను వొక్క నిట్టూర్పువిడిచి, ‘‘అయితే మీరే పంపించారన్నమాట’’ అన్నాడు. ‘‘ఎక్కడికి’’ అన్నది తల్లి అనుమానంతో వరలక్ష్మివంక చూస్తూ...

‘‘ఇప్పుడు ఇంట్లో లేడన్నమాట’’ అన్నాడు తను. ‘‘లేడు’’ అన్నది తల్లి.

అయితే వీడేను. ఇందాక నేను వస్తుంటే ఆ జంక్షన్లో కనుపించాడు. నన్నుచూసి గభాలున మొహంతప్పించి, లోపలికి వొదిగికూచున్నాడు. వీడేనేమో అని పిలుద్దామనుకుంటుండగా రైలుకదిలింది... ఎక్కడికి వెళ్ళాడు? దేనికివెళుతున్నాడు?...ఏమోరా మాకసలు తెలియదు. ప్రొద్దుణ్ణుంచీ అదేఊహామథన పడుతున్నాం. దాన్నడిగితే ఏమీచెప్పదు. అట్టా ఖరాగానుంచు నూరుకుంటుంది’’ అంటూ వరలక్ష్మివంక చూసింది తల్లి...

‘‘ఏంమ్మా వరలక్ష్మి నీతో ఏంచెప్పాడు’’ వరలక్ష్మిని అడిగాడు...ఏమో బావా నాకేమీ చెప్పలేదు నిజంగాను’’ అన్నది వరలక్ష్మి ఏమీతోయని దిక్కుమొహంతో...

అరే విచిత్రంగావున్నదే అనుకున్నారు...మళ్ళీ అరుగుమీద నలుగురూ పోగై తలోకమాటా అంటుంటే వరలక్ష్మి మనస్సు కష్టంతో నిండింది. గదిలోనికి వెళ్ళిపోయింది.—పాకెట్లో నలుగురూ చెప్పుకునేమాటలు చాలాబాధను కలిగిస్తున్నై.—"అడగండి, దానినే అడగండి. ఎక్కడికి పంపిందో ఎందుకు పంపిందో అడగండి" అంటున్నారు అందరూను. ఇంక తన మీదనే నిందలు మోపుతున్నారా లేదా? అన్న విషయంలో అనుమానం ఏముంది?—

ఇంక సీతారాముడు ఎక్కడికో లేచి పోయినాడు అనుకున్నారంతాను. అనేకమంది అనేక విధాలుగా వరలక్ష్మిని అడిగి విసిగించడం మొదలు పెట్టారు. ఈ విషయం అందరికీ తెలిసింది. వరలక్ష్మి మరీ లోకువైంది. ప్రతివారూ తన్ను తేలికగా చూస్తున్నారు.—ఇంట్లో అందరికీ వరలక్ష్మిమీద కోపంగానేవున్నది. ఇటు ఒకప్రక్క అన్నకూతురు, మరోపక్క కోడలు. అయినా ఏవో భిన్నాభిప్రాయాలు ఏర్పడినాయ్. ఇంట్లో అందరికీ—ఒకరినొకరు సరిగా అర్థంచేసుకునే పరిస్థితి తప్పిపోయింది.—దీని మూలంగా ఇంట్లో అందరికీ అనుక్షణమూ మనస్పర్థలు పెరిగిపోయినై. ఇక నావాతావరణంలో నిలవటం మరీ కష్టమనిపించింది వరలక్ష్మికి—

* * *

ఒకనాడు వెంకటరత్నంగారికి ఉత్తరం వ్రాశారు. "మీఅల్లుడు దేశంమీదికి లేచి పోయినాడు. మీయిష్టం. చేతనైతే వెతికి తెచ్చుకోనండి"

ఆయన గాభరాపడి ఇక్కడికి పరుగెత్తుకు వచ్చాడు. ...వాతావరణమంతా గజిబిజిగా వున్నది. ...వరలక్ష్మికూడ నాన్నతో పుట్టినింటికి వెళ్ళింది—.

## 6

ఒకనాడు వరలక్ష్మిని దగ్గర కూర్చోపెట్టుకుని అడిగాడు వెంకటరత్నంగారు. అనునయిస్తూ జరిగిన సంగతంతా చెప్పింది వరలక్ష్మి...

"నేను చెప్పలేదా అమ్మా. అసలిదంతా జరుగుతుందనే మొట్టమొదట చదువు మాన్పించాను. అయినా అంతపనీ జరిగేతీరింది. ఏంచేస్తాం? ఎక్కడున్నాడని వెదదాం ఏమన్నా అంతూపంతూ తెలుస్తుంది కనుకనా?..." అంటూ విచారంగా తనవంక చూశాడు నాన్న...

"దిగులుపడతావెందుకు నాన్నా! దేశం తెగించి ఎక్కడికి వెడతారు! ఈ నిందలన్నీ నామీదపడకుండా ఎక్కడున్నారో తెలుసుకుందాం..." అన్నది వరలక్ష్మి...నాన్నకు ధైర్యం చెబుతున్నట్లుగా. పిచ్చిదాన! ఎక్కడవున్నాడని తీసుకవస్తాం? అంటూ వరలక్ష్మి అమాయకత్వాన్ని చూసి నవ్వుకున్నాడు వెంకటరత్నంగారు. ఏమైనాడో ఏమి అఘాయిత్వం చేశాడో అని వెంకటరత్నంగారు దిగులుపడుతున్నాడు...తనమీదకు ఏంవస్తుందోఅని భయపడుతున్నాడు—

ఒకనాడు వాళ్ళఆఫీసులో గుమస్తాయే అడిగే వరకూ ఈవిషయం ఇంతఉబ్బెత్తుగా వ్యాపించిందని వెంకటరత్నంగారు అనుకోలేదు. ఏం సమాధానం చెప్పినా నలుగురిలోను ఆయనకి చిన్నతనమైంది. ఇంటికొచ్చి తల వేలాడవేసుకొని అరుగుమీద కూచున్నాడు దిగులుగా...

"ఏమిటి నాన్నా ఇవ్వాళ అలాకూచున్నావ్" అన్నది వరలక్ష్మి నాన్నదగ్గరకూచుని, చనువుగా కోటుజేబులో చెయ్యిపెడుతూ...

ఏముందమ్మా చదువుకున్నందుకు నువ్వూ చెప్పించినందుకు నేనూ ఇద్దరంభిధనపడ్డాం. వాళ్ళకేం వాళ్ళమటుక్కు వాళ్లు బాగానేవుంటారు. అందరూ నిన్నూ నన్నూ అంటున్నారు.—నాన్న ముఖంలోనికి చూస్తే ఏమిటో ఉంచుకు పోయినట్లు కనబడుతున్నాడు.... "నిజంగానా నాన్నా? వరలక్ష్మి అడిగింది నాన్న ముఖంలోకి చూస్తూ. వెంకటరత్నంగారు ఏమిటో బాధగా వరలక్ష్మివంక చూశాడు. చివాల్న నాన్నదగ్గరనుంచి లేచించి వరలక్ష్మి..."అమ్మాయీ ఇట్లా కూర్చో" అన్నాడు

వెంకటరత్నంగారు చెయ్యిపట్టుకుని. వరలక్ష్మి నాన్న ఎదురుగుండా కూచున్నది. "అతను ఎందుకు వెళ్ళాడు నిజం చెప్పు. నాదగ్గర అబద్ధమెందుకు. చెప్పమ్మా నీకు భయంలేదుగా. నాన్న ఏమంటాడు? చదువుకుంటావంటే చెప్పించలేదు? చెప్పమ్మా వరలక్ష్మి! మెల్లిగా తలమీద నిమురుతూ అడిగాడు వెంకటరత్నంగారు.—

"అంటే నాన్నా నేచెప్పింది నిజమేను. ఇంకా నాకేమీ తెలియదు నాన్నా...అన్నది వరలక్ష్మి. వెంకటరత్నంగారి హృదయంలో అనుమానం తలెత్తింది. పొంగులుపారి వెల్లువికి వస్తున్నది. నలుగురిలోను తన్ను అడిగినమాటలు ఇంకా శూలాల్లా బాధిస్తున్నాయ్ తన హృదయంలో...

"నువ్వతన్నేమీ రొష్టుపెట్టలేదు?....." అన్నాడు వెంకటరత్నంగారు. ఈసారి నాన్నమాటలో కొద్దిగా కాఠిన్యం కనపడుతున్నది. "లేదు నాన్నా ఆయన్ని నేనెన్నడూ ఏమీ అనలేదు. ఏది చెబితే అదే చేశాను. ఒక్కనాడు కూడ ఆయన మాటకు ఎదురుచెప్పలేదు" వరలక్ష్మి దీనంగా అంటున్నమాటలైనా అయనలోవుండే దురభిమానాన్ని రెచ్చగొట్టినట్లున్నాయ్.—"కాదు నువ్వు నాముందర బొంకుతున్నావ్. నిజంచెప్పు. చెప్పాల్సిందే," రెండుబుజాలమీదా చేతులువేసి గట్టిగా పట్టుకుని అడిగాడు వెంకటరత్నం గారు.

ఈసారి నాన్నమాటలో కర్కశత్వం కనపడుతున్నది. వరలక్ష్మి భయంతో నాన్నవంక బెదురుగాచూస్తూ "అయన్నేమీ రొష్టుపెట్టను" అన్నది ఏడుపుమొహంతో...చూస్తుండగానే కనుకొలకుల్లోనుంచి బొటబొటా నీళ్ళు కారినాయ్. నాన్ననుచూస్తుంటే భయంవేసింది వరలక్ష్మికి.—

ముఖం కందగడ్డలా చేసుకుని "ఏం, చెప్పవేం దయ్యంలాగా చూస్తావ్ గుడ్లుపెట్టుకుని. నేనేమైనా తలెత్తుకు వీధిలో తిరగాల? ఏంచేశావ్ చెప్పు. చెప్పాలి ఇకతప్పదు" భీకరంగా గద్దించి అడిగాడు. వరలక్ష్మి ఏమీచెప్పక నాన్నవంక చూస్తూ అలాగే ప్రతిమలా కూచున్నది. నాన్నను చూస్తుంటే...భయంతో...వొళ్ళు గజగజా వొణికింది. తలా మొహం ముచ్చెమటలుపోసినై. పెదవులు వణుకుతూ "నేనేమీ ఎరుగను నాన్నా" అన్నది ఏడుస్తున్నట్లుగా....రెండుచేతులూ పట్టుకుని ఏడుస్తూనే, అపవసరంగా అనుమానపడతావెందుకు నాన్నా? నేనేమీ ఎరుగను నాన్నా. హృదయం తరుక్కుపోయేలా, కన్నీరుకమ్ముతూ దీనంగా వరలక్ష్మి చూసేచూపులు ఆతండ్రి హృదయానికి చలనాన్ని కలిగించలేదు. ఇంతవరకూ సున్నితమైన ఆయన హృదయం ఇప్పుడు వరలక్ష్మి విషయంలో వజ్రంకంటె కఠోరమైంది.—కన్నబిడ్డయందు వాత్సల్యాన్ని కూడ నశింపజేసే దురభిమానానికి ఆయన వశుడైనాడు. ఎదురుగా అలాకూచున్న వరలక్ష్మి

"ఖోడే" వారి ఉత్పత్తులు
ప్రాశస్త్యానికి పేరెన్నికగన్నవి

■

శుద్ధమైన సిల్కు రిబ్బనులు
మరియు
కాటన్ పైపింగులు

■

చక్కని విశిష్టమైన నేత, ఆకర్షణీయమైన డిజైనులు, అద్భుతమైన తయారు, చక్కని రంగులలో సరసమైనధరలకు లభించును.

■

టోకు వ్యాపారానికి ఈ చిరునామాకు వ్రాయండి:

**Khodey Ribbon Carbon & Allied Industries**
(Pioneer Ribbon Manufacturers)
**55, Santhusapet, Bangalore City.**

బ్రహ్మరాక్షసిలా ఆయనకు కనపడుతున్నది. తన పరువూ ప్రతిష్ఠా నాశనంచెయ్యటానికి ఈరూపంలో తనింట్లో అవతరించిందా అనుకున్నాడు. కన్న కూతురి సతీత్వాన్ని కూడ మరిపింపజేసే దుష్టమనః ప్రవృత్తికి దాసుడైనాడు... నాన్నా... అంటూ ఇంకేమిటో చెప్పబోతున్నది వరలక్ష్మి. కన్నీరు కమ్ముటంచేత ఎదురుగావున్న నాన్న మొహంకూడ సరిగా కనపడటంలేదు.

"ఛీ.... నాముందు బొంకులాడుతున్నావ్. అంటూ కళ్ళు ఇంతింతచేసి ఉరిమిచూశాడు. నీమూలంగా నాకొంప వీధిలోనికి లాగుతున్నారు. మొగుణ్ణి వొదిలిపెట్టి పుట్టింట్లో చేరింది అంటున్నారు. సర్వంచేశావ్. చెప్పవేం? అంటూ మరీభీకరంగా గద్దించి అడిగాడు.— ఏమీచెప్పక కన్నీరుకారుస్తూ అలాగేచూస్తూకూచున్న వరలక్ష్మిని చేతులు విడిపించుకుని గభాలున ఇంట్లోకివెళ్ళిపోయినాడు. ఆవిసురుకు వరలక్ష్మి ముందుకుపడింది. ముక్కు నేలకు కొట్టుకుని బొటబొటా నెత్తురుకారింది. ఏడుస్తూ పవిటచెంగుతో ముక్కుతుడుచుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది వరలక్ష్మి.

## 7

కన్నతండ్రే తన నిజాయితీని శంకించాడు. తను ఇకముందు చెయ్యాల్సినదేమిటి? ఎన్ని విధాల తన మంచితనాన్ని నిరూపించుకోతలిచినా, అది చెడుగా పరిణమించుతున్నది. తను మంచిదే కావచ్చును, తను నిరపరాధిని అని తనకు నమ్మకముండొచ్చు. కాని, తనలో వుంటేగుణాన్ని గ్రహించగలిగిన లోకమేది? కన్నతండ్రికంటె తనకు లోకమేమున్నది? తన సతీత్వాన్నిసైతం శంకించాడు తండ్రి.

ఇంతకూ తను చదువుకోవటం ప్రపంచంలో తనుకూడ ఒక విజ్ఞానవతికావటం, ఒక మనిషిగా బ్రతకటం మహాపరాధమైంది. తనవిజ్ఞానంలో తనకు నమ్మకముంటే, భర్తవిషయంలో తను నిరపరాధిని, అనే ఆత్మవిశ్వాసముంటే ఎంతటిత్యాగానికైనా సిద్ధపడాలి, తన సత్యాన్ని నిరూపించుకోవాలి. తన వెన్నెనొక గుసగుసలాడే గుడ్డిలోకానికంతకూ కనువిప్పయేలా చెయ్యాలి, తననైజాన్ని నిరూపించుకోవాలి.

సీతారాముడు ఎక్కడో వుండివుండొచ్చును. కాని, తను అతనికోసరం అన్వేషిస్తుంది. తను ఇక నీప్రపంచంముందు నిలబడి తలెత్తుకుతిరగలేదు. ఈకాకులమధ్య తనమాట ఎవరు వింటారు?—తన ఆత్మవిశ్వాసమే వాళ్ళను నమ్మించుతుందేమో...

* * *

అర్ధరాత్రి...అంతానిశ్శబ్దం. ఎదురుగా గోడనున్న గడియారం టక్ టక్ కొడుతున్నది, కాలాన్నంతా అట్టే లెక్కచూస్తున్నట్లుగా,—అవమానంతో శోకంతోనిండి నిబిడీకృతమైన వరలక్ష్మి హృదయం కల్లోలితమై విషపురుగుల్ని కక్కుతున్నది....శాంతిలేదు....మంచంనడుమనెక్కి కూచున్నది శక్తిలాగ—టంగ్‌న గంటకొట్టింది గడియారం "ఇకలే...నీ నిజాయితీని కాపాడుకో, సతీత్వాన్ని నిలబెట్టుకో. ఈపాడులోకపు చీకటిఅంచుల్లోనుంచి బయటపడు...అని హెచ్చరిస్తున్నట్లుగా ...మంచందిగి గబగబా సావిట్లోకి వచ్చింది వరలక్ష్మి...అందరూ వొళ్ళుతెలియకుండా పడుకున్నారు....సరాసరివెళ్ళి ఎదురుకుండా కొంకెన వున్న నాన్నకోటుజేబులో చెయ్యిపెట్టింది—ఇది కన్నతండ్రిదగ్గరచేసే దొంగతనంకావచ్చు, మోసం కావచ్చు, కాని ఇప్పుడు తనజీవితం సంకటపరిస్థితిలోపడింది. లోకులనే అపవాదులను దుష్ప్రచారాన్ని ఎలాసహించటం?...తనమీద పెనుభూతంలా పడిన ఈనిందల్ని ఎవరుసహించి వూరుకుంటారు? విజ్ఞానవతియైన వరలక్ష్మి ఎందుకు సహిస్తుంది? ఇది ...తనకేకాదు...తనజాతికే కలంకం...తనలా చదువుకున్న యువతులెందరో వున్నారు. వారందరి జీవితాలకీ ఇది తీరనికలంకం, గొడ్డలిపెట్టు. ఈ నిం

తను రూపుమాపకపోతే రాగల పరిణామాలు చేసే ప్రచారాలు జాతినంతనూ ఒక అగాధంలోనికి నడిపించుతాయ్. అభ్యుదయాన్ని కాంక్షించి ముందుకు పోయే ప్రతివిద్యావతియైన భార్యకూ ఇది విషసర్పంలా పాకలుకక్కుతూ అడుగడుక్కూ కాళ్ళకు అడ్డం తగులుతూంటుంది. భయంకరంగా పెనవేసుకుంటుంది. ఈవిషబంధాలను త్రెంచి సమూలంగా నాశనంచేసి ముందుకు అడుగువేయాలి. తనమీద తనలాంటి భార్యలమీద లోకంలోజరిగే విషపూరిత ప్రచారాన్నంతా అరికట్టాలి. అనవసరపు దురభిమానానికిలోనై తనలాంటి నిరపరాధినులమీద అపోహాలను కల్పించే భర్తలందరికీ కనువిప్పయేలా తమ ఆత్మశక్తిని నిరూపించాలి. ఇది తనమీదపడిన గురుతర కార్యభారం. సాధించతగిన మహాకార్యం! ఆదర్శజీవితానికి నాంది...అందులో ఇదొక దొంగతనం క్రింద రాదు అనుకున్నది. తన నైజాన్ని తన సతీత్వాన్ని సైతం కన్నతండ్రిదగ్గరే నిరూపించవలసిన విషపుసమయం ఇది ఆసన్నమైంది. తను స్వతంత్రించి తీసుకుంటున్నాను అనుకున్నది...

గుమ్మంలోకివచ్చి తలుపుతీసుకుని బయటకు చూసింది. కృష్ణపక్షచంద్రుడు అప్పుడే ఉదయిస్తున్నాడు. మబ్బులచాటునుంచి గ్రుడ్డివెన్నెల భూమిమీదపడుతున్నది.—ఏదో శక్తి పద అని ముందుకు నెట్టింది. రోడ్డువెంట మనోవేగంతో నడిచిపోయింది......స్టేషన్ దగ్గరకు......మద్రాసుకు టిక్కెట్టు కొనుక్కుని రైలుఎక్కింది—

## 8

కమలా! కమలా! అని బిగ్గరగా పిలుస్తూ తలుపుకొడుతుంటే తొందర తొందరగావచ్చి తలుపుతీసింది కమల...గుమ్మంలోనుంచున్న వరలక్ష్మిని చూసి నిర్ఘాంతపోయింది. "వరలక్ష్మి...అన్నదిఆశ్చర్యంగా...ఇస్సో గొడవచెయ్యకు కమల, నిన్ను నమ్ముకుని ఇక్కడికివచ్చాను. ఏ విషయము మూడోవ్యక్తికి తెలియకూడదు. అలానాకు ప్రామిస్ చెయ్యాలి. తరువాత మిగిలినదంతా చెబుతాను. వరలక్ష్మిని మెల్లిగా చెయ్యిపట్టుకుని లోపలకు తీసుకువెళ్ళింది కమల.

కమల వరలక్ష్మి ఇద్దరూ స్కూలుఫైనల్ వరకూ చదువుకున్నారు. అప్పట్లో వెంకటరత్నం గారు కూడ మద్రాసులోనే వున్నాడు. తరువాత ఇంటర్ మీడియెట్ చదువుతుండగా వరలక్ష్మిని చదువుమాన్పించారు మరోవూరు వచ్చేశారు కూడాను. కమల మాత్రం ఇంటర్ మీడియేట్ చదువుతూనే వున్నది. ఈసంవత్సరం మొదటినుంచి కమల మొగుడు బెనారెస్‌లో సైన్స్‌కోర్సు చదువుతున్నాడు. కమల చదువుకుంటూంటేఅతనికెంతో మోజు. మాటిమాటికిఎన్నో ఉత్తరాలు వ్రాస్తుంటాడు. వెంకట రత్నంగారు ఇక్కడవున్న రోజుల్లో వస్తూపోతూండగా సీతారాముడికి అతనికి మంచిస్నేహం కూడా వున్నది.

అన్నంతిన్న తరువాత జరిగిన సంగతంతా చెప్పింది వరలక్ష్మి కమలకు..."ఇదేమిటి వరలక్ష్మి ఇలాచేశావాఅన్నది. కమల ఆశ్చర్యంగాను విషాదంగాను, వరలక్ష్మి ముఖంలోకి చూస్తూ" అది కాదు కమల, ఇప్పుడుముందుఏం చెయ్యాలో ఆలోచించాలి. ఆయన ఎక్కడవున్నదీ ఆచోకీ ఎలా తెలుస్తుందో కాస్త ఉపాయంచెప్పు కమల! అందుకేగా అమ్మా నీ దగ్గరకొచ్చింది? నువ్వేమన్నా ఇంటర్‌మీడియేట్ కూడ చదివేసుకుంటున్నావ్. ఇహ నాచదువూ నేను ఇలా అపవాదుల పాలయ్యాను. నామనస్సుకు చాలా కష్టంగావున్నది కమల అన్నది వరలక్ష్మి... "అదేమిటి వరలక్ష్మి! నువ్వలా అనుకుంటావ్! నువ్వు అపవాదులపాలైతే నేనుమాత్రం అయినట్లుకాదు? నేను మంచిఉపాయం చెబుతాను. నువ్వలా బాధ పడకు వరలక్ష్మి. ఏదీ నావంక చూడు, ఒక్క సారి నవ్వు అంటూ వరలక్ష్మి గడ్డం పుచ్చుకుని బ్రతిమాలింది కమల. మొహంమీద పడివున్న జుట్టును పాపట్లోకి ఒత్తుచూ తల్లిలాఅనునయిస్తూ, ఏదోపిచ్చినవ్వు తెచ్చుకుని ఒక్కసారికమలవంకకు చూస్తూనవ్వింది, వరలక్ష్మి ఏమిటి తొందరగా చెప్పుకమల! అదుర్దాగా అడిగింది,

కమల ఏమిటో మాట్లాడుతుండగా ...వాకిట్లో ... ఎవరోపిలిచినట్లున్నది. కమల,గబగబవాకిట్లోకివచ్చింది...పోస్టుమెన్ ఇచ్చిన ఉత్తరం అందుకున్నది... చూస్తూ అక్కడేనుంచున్నది కొంతసేపటివరకూ...

కమలా! అని పిలిచింది వరలక్ష్మి...నీకుఉపాయం చెప్పేస్తాను వరలక్ష్మి, వింటావ్ కాదు, తప్పకుండా—నాకు ప్రామిస్ చెయ్యాలి అంటూ తొందరతొందరగా వరలక్ష్మిదగ్గరకువచ్చిందికమల. ఎవరుకమల? పిలిచింది?", అని వరలక్ష్మి అడుగుతుండగానే తప్పకుండా వింటావ్ కాదు, తప్పకుండా...అంటూ వరలక్ష్మి ముఖంలోకి అదోలా చూసింది కమల...వరలక్ష్మి ఆశ్చర్యంగా చూస్తూ ఏమిటి కమల అని అడిగింది ఉత్కంఠతో...ఇదిగో ఇలాచూడు' అంటూ కామేశ్వరరావు (కమల మొగుడు) వ్రాసినఉత్తరం చూపించింది కమల.... అందులో అతనిలా వ్రాశాడు...

"చివరకి మరోవిషయం వ్రాస్తున్నాను కమల. పదిరోజులు క్రిందట వరలక్ష్మి మొగుడు సీతారాముడు నాకు బెనారస్‌లో కనుపించాడు. అతనుఇంటిదగ్గర ఎవరితోను చెప్పకుండా చివరకి వరలక్ష్మితోకూడా చెప్పకుండా ఇక్కడికి వచ్చినాడుట. అతనిఉద్దేశ్యమేమిటో మనసువిప్పి నాతోచెప్పాడు. డబ్బులేక ఉంటానికి ఇల్లుదొరకక చాలా బాధలుపడుతుంటే నారూమ్‌కు తీసుకవచ్చాను. ఇప్పుడు ఇద్దరమూ కలిసేయున్నాం. అతనుఈయేటే బెనారస్ మెట్రిక్యులేషన్‌కు వెళ్ళాలిఅని పట్టుదలతో చదువుతున్నాడు. వరలక్ష్మినిగురించి చాల విచారపడుతున్నాడు. వీలైతే వరలక్ష్మికికూడ తెలియజెయ్యి" వరలక్ష్మి మాటిమాటికీ అదేచదువుతుంది తలెత్తకుండా. ఏం వరలక్ష్మి, అంతదీపిగా చదువుతున్నావ్" అన్నది కమల ఏమీ తెలియనట్లుగా...నవ్వుతూ. ఇదంతా చాలవిచిత్రంగా వున్నది కమల...దీర్ఘంగా ఒక నిట్టూర్పువిడిచి ఏదో లోకంలోనుంచి బయటపడినట్లుగా అన్నది వరలక్ష్మి ఆశ్చర్యంగా...ఏమో బాబు చివరికి మాఆయన అట్టా రాశారు...నీకు చూపించాను ... తరువాత నీ యిష్టం ... అన్నది కమల—

ఏం...మ్మా... అంతతో నీపని అయిపోయిందనుకున్నావా? ఏదైనా ఉపాయం చెప్పు కమలా? వరలక్ష్మి దిక్కుమొహం వేసుకొని అడిగింది.

కమల కొంతసేపు ఆలోచించి, ఇం... అధైర్యపడతావెందుకు వరలక్ష్మి! నువ్వు అతనికో ఉత్తరం ఎందుకు వ్రాయకూడదు? కమల అన్న మాటకు రెండుకళ్ళూ విప్పి కమల మొహంవంక చూచింది వరలక్ష్మి...తప్పకుండా వ్రాయమంటావా...అని అడిగింది. తప్పకుండాను...అని ధైర్యంగా చెప్పింది కమల.

* * *

వరలక్ష్మివ్రాసిన ఉత్తరం చూడుకునే సరికి నిలువునా నీరైపోయినాడు సీతారాముడు. వరలక్ష్మిని ఎంతమంది ఎన్నివిధాల అంటున్నారో చూశావా—అంటూ కామేశ్వరరావుకు చూపించాడు. నేను చాలా పొరపాటే చేశానా కామేశ్వరం— సీతారాముడు అడిగిన మాటకు ఒక్కసారి నవ్వి— వరలక్ష్మిని మాకమలను ఇక్కడికి రమ్మని ఉత్తరం వ్రాయి అని సలహా ఇచ్చాడు కామేశ్వరరావు.

సీతారాముడు వ్రాసిన ఉత్తరం వరలక్ష్మికి అందింది. కాని, మనస్సులో రేగుతున్న కలవరం పూర్తిగా చల్లారలేదు..— తను బయలుదేరివచ్చిన ఆశయం తప్పక సిద్ధిస్తుంది. తననైజాన్ని ప్రపంచానికి చాటగలను అనే ఆత్మవిశ్వాసంతోటే సీతారాముడి జాడ అన్వేషించుతున్నాను అనుకున్నది. ఆ దృఢ సంకల్పంతోటే కమలతోకూడ బెనారస్ ప్రయాణమై వెళ్ళింది వరలక్ష్మి.—